

**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**

| | |
|---|---|
| నగదు | రూ.5,10,710 |
| బంగారం | 2 గ్రాముల 200 మిల్లీ గ్రాములు |
| వెండి | 162 గ్రాముల 700 మిల్లీ గ్రాములు |

\- భువనేశ్వర్/పూరీ



**అంబులెన్స్ ఢీకొని దంపతులు మృతి**

అంబులెన్స్ ఢీకొని దంపతులు మృతి చెందిన విషాదకర ఘటన బౌద్ జిల్లాలో శనివారం చోటుచేసుకుంది.

- 8లో

**బీజేడీ స్టార్ క్యాంపెయినర్ల జాబితా విడుదల**



రాయగడ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అధికార బీజేడీ పార్టీ ఎన్నికల ప్రచారానికి సంబంధించి సన్నాహాలు చేసింది. ఈ క్రమంలో ఎన్నికల ప్రచారం నిమిత్తం స్టార్ క్యాంపెయినర్ల జాబితాను శంఖ భవన్ నుంచి శనివారం విడుదల చేసింది.

- 8లో

## న్యూస్‌రీల్

### బీజేడీకి బిందురాణి మిశ్ర రాజీనామా



బిందురాణి మిశ్ర

జయపురం: నియోజకవర్గంలో బీజేడీ నుంచి టిక్కెట్టు ఆశించి భంగపడిన సీనియర్ మహిళా నాయకురాలు బిందురాణి ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. సీఎం నవీన పట్నాయక్‌కు తన రాజీనామా లేఖను పంపానని శనివారం ఆమె వెల్లడించారు. భవిష్యత్తు కార్యాచరణ త్వరలో ప్రకటిస్తానని పేర్కొన్నారు. జయపురం మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్, కొరాపుట్ జిల్లా పరిషత్ మాజీ సభ్యురాలైన బిందురాణి మిశ్ర 1997లో జనతా దళ్‌లో చేరి తన రాజకీయ జీవితానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ఏర్పాటైన బీజేడీలో ఆ పార్టీ కార్యకర్తగా చేరారు. 1997లో జరిగిన జయపురం మున్సిపల్ ఎన్నికలో బీజేడీ అభ్యర్థిగా పోటీ చేశారు. అనంతరం 2003లో మరోసారి పోటీచేసి కౌన్సిలర్‌గా గెలిపొందారు. 2017 నుంచి 2023 వరకు కొరాపుట్ జిల్లా పరిషత్ సభ్యురాలుగా జయపురం సమితి నుంచి ఎన్నికయ్యారు. అంతేకాకుండా పార్టీలో వివిధ పదవుల్లో నియమించబడి క్రియాశీల మహిళా నేతగా పనిచేశారు.

### విజిలెన్స్ వలలో విద్యాశాఖ అధికారి



అరెస్టైన బీఈవో రబింద్ర పాఢి

బరంపురం: విజిలెన్స్ వలకు మరో అవినీతి చేప చిక్కింది. బౌధ్ జిల్లా హరబంగా బ్లాక్ బీఈవో (బ్లాక్ ఎడ్యుకేషనల్ అధికారి) రబింద్ర పాఢి పింఛన్ మంజూరు చేసేందుకు రూ.20 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా విజిలెన్స్ అధికారులకు చిక్కారు. బరంపురం విజిలెన్స్ ఎస్పీ సోమనాథ్ బారిక్ తెలిపిన వివరాల మేరకు.. బౌధ్ జిల్లా హరబంగా బ్లాక్‌లో గుప్తేశ్వర్ ముఖికి పింఛన్ మంజూరు చేసేందుకు రబింద్ర పాఢి రూ.40 వేల లంచం డిమండ్ చేశారు. దీంతో బాధితుడు గుప్తేశ్వర్ ముఖి బరంపురం విజిలెన్స్ అధికారులను ఆశ్రయించారు. హరబంగా బ్లాక్ కార్యాలయంలో పథకం పన్ని లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. అన్ని ఆధారాలు సేకరించి కోర్టుకు తరలించినట్లు విజిలెన్స్ ఎస్పీ సోమనాథ్ బారిక్ వెల్లడించారు.

### గుమ్మలో ఏనుగుల బీభత్సం



ఏనుగులు ధ్వంసం చేసిన అరటి పంట

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి పాట్టంగి పాడొరా అటవీ రేంజ్ పరిధి పర్శలి పంచాయతీలోని గుమ్మ గ్రామంలో శుక్రవారం రాత్రి ఏనుగులు బీభత్సం సృష్టించాయి. గ్రామంలో ఆదివాసీలు పండించే అల్లం, పసుపు, అరటి పంటలను ధ్వంసం చేశాయి. గ్రామానికి చెందిన శికక తమ, శికక లక్ష్మణ్, శికక బామున అనే ఆదివాసీ రైతులకు చెందిన ఈ పంటలను ధ్వంసం చేయడంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో స్పందించిన రేంజర్ చందన్ గొమాంగో ఆదేశాల మేరకు ఫారెస్టర్ సహదేవ్ రౌత్, అటవీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఏనుగులు ధ్వంసం చేసిన అరటి తోటలను పరిశీలించారు. గ్రామస్తులు, పంటలను సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### ఎలుగు బంటి హల్‌చల్





ఎలుగును అనుసరిస్తున్న అటవీ శాఖ సిబ్బంది, (ఇన్‌సెట్లో) కొరాపుట్ పోస్టాఫీసు వద్ద ఎలుగు బంటి

కొరాపుట్: జిల్లా కేంద్రంలో ఎలుగు బంటి హల్‌చల్ చేసింది. శనివారం వేకువజామున పట్టణంలోకి ప్రవేశించింది. ఇది గమనించిన ప్రజలు అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. ప్రధాన వీధుల్లో ఆహారం కోసం ఎలుగు అన్వేషించింది. అటవీ సిబ్బంది ఎలుగుని అనుసరిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రధాన కూడలిలో ఉన్న పోస్టాఫీసు ప్రహరి దాటి లోపలకి ప్రవేశించింది. అయితే లోపల ఎటువంటి ఆహారం లేకపోవడంతో బయటకు వచ్చింది. తెల్లవారుతుండగా ప్రజల సంచారం పెరగడంతో ఎలుగు వచ్చిన దారిలోనే తిరిగి అటవీ ప్రాంతంలోనికి వెళ్లిపోయింది. ఉదయం ఈ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ప్రజలు అప్రమత్తమయ్యారు.

# నామినేషన్ల జోరు..!

బరంపురం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల గడువు ముంచుకొస్తుండడంతో పోటీ చేస్తున్న అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంలో బిజీగా మారారు. బరంపురం ఉప జిల్లా కార్యాలయంలో బరంపురం శాసనసభ నియోజకవర్గం తరపున స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మేయర్ శిబశంకర్ దాస్ తన నామినేషన్ దాఖలు చేశారు. అలాగే బరంపురం లోక్‌సభ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న కె.చంద్రశేఖర్ నాయుడు, మరోవైపు డీఎస్‌వో (డెమోక్రసీ స్టూడెంట్ అర్గనైజేషన్) తరపున రాష్ట్ర కన్వీనర్ సోమనాథ్ బెహరా సైతం నామినేషన్ దాఖలు చేశారు.

పర్లాకిమిడి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పర్లాకిమిడి నియోజకవర్గం ఇండిపెండెంట్ అభ్యర్థిగా జర్నలిస్టు అమోద్ బర్దన్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు తన అనుచరులతో కలిసి ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిపొందితే పట్టణంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరుస్తానని తెలియజేశారు. అలాగే కలెక్టరేట్‌లో మోహనా నియోజకవర్గం(ఎస్టీ) నుంచి స్వతంత్ర అభ్యర్థిగా న్యాయవాది మోజేష్ దళబెహరా నామినేషన్ దాఖలు చేశారు. మొత్తంగా జిల్లా కేంద్రంలో రెండు నామినేషన్లు దాఖలు అయ్యాయి.

రాయగడ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని గుణుపూర్ శాసనసభ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా రస్మిత కుమారి సాబొరొ తన నామినేషన్ పత్రాన్ని శనివారం సమర్పించారు. కాగా ఈనెల 23వ తేదీన రాయగడ శాసనసభ నుంచి బీజేడీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అనసూయా మాఝి తన నామినేషన్ పత్రాన్ని దాఖలు చేస్తారని బీజేడీ శ్రేణులు తెలియజేశాయి.



పర్లాకిమిడి: నామినేషన్ దాఖలు చేస్తున్న మోజేష్ దళబెహరా



రాయగడ: నామినేషన్ పత్రాన్ని సమర్పిస్తున్న రస్మిత



పర్లాకిమిడి: నామినేషన్ దాఖలు చేస్తున్న జర్నలిస్టు అమోద్ బర్దన్



బరంపురం: లోక్‌సభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న సోమనాథ్ బెహరా



బరంపురం: నామినేషన్ దాఖలు చేస్తున్న చంద్రశేఖర్ నాయుడు



బరంపురం: నామినేషన్ దాఖలు చేస్తున్న శిబశంకర్ దాస్

# బీజేడీ ఆరో జాబితా విడుదల



భువనేశ్వర్: బిజూ జనతా దళ్ (బీజేడీ) అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీ అభ్యర్థుల ఆరో జాబితాను శనివారం ప్రకటించారు. వీడియో సందేశం ద్వారా ఆయన అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. గురువారం బిజూ జనతా దళ్‌లో చేరిన ఓలీవుడ్ నటి వర్షా ప్రియదర్శిని జాజ్‌పూర్ జిల్లా బొడొచొణ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి పోటీ చేసేందుకు టికెట్ దక్కించుకున్నారు. ఎన్నికల పోరులో పోరాడడం ఆమెకి ఇదే తొలిసారి కావడం విశేషం. ఇటీవలే కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేడీలో చేరిన గణేశ్వర్ బెహెరా కేంద్రాపడా అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. బీజేడీ 6వ అభ్యర్థుల జాబితాలో 4 కొత్త ముఖాలకు అవకాశం లభించగా, 4 మంది మహిళల అభ్యర్థిత్వం ఖరారు అయింది. బొడొచొణ నుంచి వర్షా ప్రియదర్శిని, చంపువా నుంచి సనాతన్ మహాకుడు, కేంద్రాపడా నుంచి గణేశ్వర్ బెహెరా, చిలికా నుంచి రఘునాథ్ సాహు, ఆనంద్‌పూర్ నుంచి అభిమన్యు సెఠి, సొరొసొకొనా నుంచి దేబాశిష్ మరాండీ, రెముణా నుంచి విద్యాస్మిత మహాలిక్, సిములియా నుంచి శుభాషిణి సాహు, కరంజియా నుంచి వాసంతి హేంబ్రం బీజేడీ అభ్యర్థులుగా ప్రకటించింది.

**12 స్థానాలు పెండింగ్**

బీజేడీ ఇప్పటివరకు 135 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించగా, 12 స్థానాలకు ఇంకా ప్రకటించాల్సి ఉంది. భారతీయ జనతా పార్టీ ఇప్పటివరకు 16 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించలేదు. అదేవిధంగా కాంగ్రెస్ 125 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించగా మరో 22 స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేయలేదు. బీజేడీ విడుదల చేసిన తాజా అభ్యర్థుల జాబితాలో 3 మంది మాజీ మంత్రులకు పోటీ అవకాశం లేకుండా పోయింది. వీరిలో కేంద్రాపడా ఎమ్మెల్యే శశిభూషణ్ బెహెరా, సిములియా ఎమ్మెల్యే జ్యోతి ప్రకాష్ పాణిగ్రాహి, బొడొచొణ ఎమ్మెల్యే అమర్ ప్రసాద్ శత్పతి ఉన్నారు.

# ‘తాగునీటి సమస్య పరిష్కరిస్తాం’



కొత్తగుడ గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

రాయగడ: గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో పాటు తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను తామంతా బహిష్కరిస్తామని స్థానికులు హెచ్చరించడంతో అధికారుల్లో చలనం పుట్టింది.

వెంటనే గ్రామానికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో పాటు తాగునీటి సమస్యను రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని అన్నారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి మజ్జిగుడ పంచాయతీలోని కొత్తగుడ గ్రామంలో గత ఆరు నెలలుగా తాగునీటి సమస్య వేదిస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కానీ వారు సమస్యను పట్టించుకోకపోవడంతో ఎన్నికలు బహిష్కరిస్తామని హెచ్చరించడంతో అధికారులపై ఒత్తిడి పడింది. ఈ గ్రామం రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక ప్రాతినిధ్యం వహిస్తున్న బిసంకటక్ శాసనసభ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. గ్రామస్తుల హెచ్చరికలను దృష్టిలో పెట్టుకున్న మంత్రి సరక స్పందించి సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించడంతో వారు గ్రామానికి శనివారం చేరుకుని సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# ఎన్నికల ప్రదర్శన బోర్డు ఏర్పాటు




ఎల్ఈడీ ప్రదర్శన బోర్డు తిలకిస్తున్న ఎన్నికల అధికారులు

భువనేశ్వర్: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల హడావుడి క్రమంగా పుంజుకుంటోంది. పలు ప్రాంతాల్లో తొలి విడత పోలింగ్ కావడంతో రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఎన్నికల యంత్రాంగం పలు కార్యక్రమాల్లో తలమునకలవుతోంది. ప్రధానంగా ఓటు వేయడంపై ఓటరుని చైతన్యపరిచే దిశలో పలు ఆసక్తికరమైన ప్రదర్శనలు నిర్వహిస్తోంది. ఈ కార్యాచరణలో భాగంగా స్థానిక ఎన్నికల అధికారి కార్యాలయం ఆవరణలో భారీ ఎల్ఈడీ ప్రదర్శన బోర్డు ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సీఈవో నికుంజ బిహారి ధొలా ఈ బోర్డుని ప్రారంభించారు. సామాన్య ఓటరుని ఆకట్టుకునేందుకు ఎన్నికలు పురస్కరించుకుని చేపడుతున్న పలు చైతన్య కార్యక్రమాలు, ప్రదర్శనలు దీనిపై ప్రసారం చేస్తారు. ప్రత్యక్ష ఎన్నికల ఫలితాల ప్రదర్శన, ఓటరు అవగాహన విషయాల వ్యాప్తి కోసం సీఈవో కార్యాలయం ఆవరణలో ఎల్ఈడీ ప్రదర్శన బోర్డ్‌ను ప్రారంభించారు.

# మద్యం బాటిళ్లతో ఒకరు అరెస్టు



పట్టుబడిన మద్యం బాటిళ్లు

జయపురం: అక్రమంగా మద్యం అమ్ముతున్న ఒక వ్యక్తిని జయపురం ఎక్సైజ్ సిబ్బంది అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జయపురం సమితి చలానగుడ గ్రామంలో విదేశీ మద్యం అక్రమంగా అమ్ముతున్న సమాచారం రావడంతో వెంటనే ఎక్సైజ్ విభాగం అధికారులు ఒక బృందాన్ని పంపారు. డీఎస్ఐ స్వాగతిక మహంతి నేతృత్వంలో చలానగుడ గ్రామం వెళ్లి ఆ గ్రామంలో రమేష్ కుమార్ బిశాయి అనే వ్యాపారి దుకాణంపై దాడి నిర్వహించినట్లు ఎక్సైజ్ విభాగ అధికారి శశికాంత దత్త్ శనివారం వెల్లడించారు. అతడి షాపులో 195 లీటర్ల 300 బీర్ బాటిళ్లు, 62 లీటర్ల 324 బాటిళ్ల మద్యం పట్టుబడినట్లు వెల్లడించారు. మొత్తం 257 లీటర్ల విదేశీ మద్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. దాడిలో ఓఐసీ నీలాద్రి బిహారి మిశ్ర, బొరిగుమ్మ ఎక్సైజ్ అధికారి విశ్వజిత్ పాణిగ్రహి, ఏఎస్ఐ ఎం.లక్ష్మణరావు, ప్రదీప్ కుమార్ దొళాయి తదితరులు పాల్గొన్నారు.

# ‘కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలి’



సమావేశంలో ప్రసంగిస్తున్న నెక్కంటి, పక్కనే సుధీర్ తదితరులు

రాయగడ: రానున్న ఎన్నికల్లో విజయానికి కార్యకర్తలంతా సమష్టిగా పని చేయాలని బీజేడీ రాయగడ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని గుణుపూర్‌లో కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి జరగనున్న సార్వత్రిక ఎన్నికలు పార్టీ ప్రతిష్టతో ముడిపడి ఉన్నాయన్నారు. ఎలాగైనా జిల్లాలోని గుణుపూర్, రాయగడ, బిసంకటక్ అసెంబ్లీ స్థానాలతో పాటు కొరాపుట్ లోక్‌సభ స్థానంలో విజయం సాధించాల్సిన అవసరం ఉందన్నారు. గత ఎన్నికల్లో విభేదాల కారణంగా రాయగడ శాసనసభ స్థానంలో ఓటమి చవిచూడాల్సి వచ్చిందన్నారు. అటువంటి తప్పులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఇదిలాఉండగా ఎన్నికల ప్రచారానికి సంబంధించి త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పర్యటన త్వరలో ఖరారు కానుందని వివరించారు. సమావేశంలో బీజేడీ రాష్ట్ర శాఖ సాధారణ కార్యదర్శి సుధీర్ దాస్, దేవీప్రసాద్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ జవాన్లకు ఏసీ హెల్మెట్లు



ఏసీ హెల్మెటుతో ట్రాఫిక్ కానిస్టేబుల్



హెల్మెటు పనితీరుని పరిశీలిస్తున్న జంట నగరాల పోలీసు కమిషనర్ సంజీబ్ పండా

భువనేశ్వర్: మండుటెండల నుంచి ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు రక్షణ కల్పించేందుకు ఒడిశా పోలీసులు శనివారం ఏసీ హెల్మెట్లను పరీక్షించడం ప్రారంభించారు. కమిషనరేట్ పోలీసులు నగరంలో ఏసీ హెల్మెట్ల ట్రయల్ రన్ శనివారం నిర్వహించారు. మూడు, నాలుగు రోజుల పాటు ప్రయోగాత్మకంగా ఈ హెల్మెట్‌లను వినియోగిస్తారు. వారి అనుభవం ఆధారంగా దశలవారీగా హెల్మెట్లను కొనుగోలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామని భువనేశ్వర్ – కటక్ జంట నగరాల పోలీసు కమిషనర్ సంజీబ్ పండా మీడియాకు తెలిపారు. ఏసీ హెల్మెట్‌లు 55 డిగ్రీల సెల్సియస్ వేడిమిలో కూడా పని చేయగలవు. శరీర ఉష్ణోగ్రతను దాదాపు 15 డిగ్రీల వరకు తగ్గించే సమర్థతతో పని చేస్తాయని భావిస్తున్నారు. దీంతో మండుటెండలో ట్రాఫిక్ జవాన్లకు వేడిమి నుంచి కొంత మేరకు ఉపశమనం కలిగించే అవకాశం ఉందని యోచిస్తున్నారు. ఒక్కో హెల్మెట్ ఎనిమిది గంటలు ఏసీతో పని చేయగలదు. దీని కోసం నిరవధికంగా 6 గంటలు ఛార్జ్ చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే గుజరాత్, పశ్చిమ బెంగాల్, దక్షిణాది రాష్ట్రాల్లో ఈ తరహా హెల్మెట్లను ఉపయోగిస్తున్నారు.

# విస్తృతంగా ఎక్సైజ్ దాడులు



కొత్తగుడలో స్వాధీనం చేసుకున్న సామగ్రి



సందుబడి వద్ద ఊటను ధ్వంసం చేస్తున్న సిబ్బంది

రాయగడ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలో నాటుసారా తయారీ, విక్రయాలు, రవాణా అరికట్టేందుకు ఎక్సైజ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. దీనిలో భాగంగా ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లో విస్తృతంగా తనికీలు నిర్వహిస్తున్నారు. గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలోని మింగులుగుడ, కొత్తగుడ ప్రాంతాల్లో అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్న కేంద్రాలపై అధికారులు నిర్వహించిన దాడుల్లో 2,500 లీటర్ల నాటుసారా తయారీకి వినియోగించే ఊటను ధ్వంసం చేశారు. అలాగే సారా తయారీకి వినియోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా రాయగడ సరిహద్దుల్లోని సందుబడి, తమిళబాయ్, రెంగళపాడు ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో 1,420 లీటర్ల నాటుసారా, 8,450 లీటర్ల ఊటను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.

## క్లుప్తంగా

### ఉద్దానంలో ఎలుగు కలకలం



వంకులూరు రోడ్డుపై సంచరిస్తున్న ఎలుగు బంటి

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన ప్రాంతం వంకులూరు గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి ఎలుగుబంటి కలకలం రేపింది. ఇటీవల అనకాపల్లి, ఎం.గడూరు, గంగువాడలో జరిగిన ఎలుగు దాడులు మరవకముందే వంకులూరులో ఎలుగు సంచరించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఒకవైపు మండుతున్న ఎండలు, ఉక్కపోతతో ఇబ్బంది పడుతుంటే మరో వైపు ఎలుగు దాడులు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తునారు. జీవనాధారమైన జీడి పంట సేకరణ కోసం తోటలకు వెళ్లాల్సిన సమయం కావడంతో ఎలుగు సంచారంతో వణికిపోతున్నారు. అత్యవసర పరిస్థితిలో ప్రయాణం చేయాలన్నా, ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం పొందేందుకు ఆరుబయట కాసేపు సేద దీరాలన్నా ఎలుగు సంచారం వల్ల భయం తప్పడం లేదని ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖాధికారులు స్పందించి ఎలుగుల సంచారాన్ని నియంత్రించాలని ఉద్దాన ప్రజలు కోరుతున్నారు.

### ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి రూ.19 లక్షల ప్యాకేజీ



శ్వేతాబాయ్‌ను అభినందిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ఇంజినీరింగ్ చివరి ఏడాది విద్యార్థిని శ్వేతాబాయ్ రూ.19 లక్షలు వార్షిక ప్యాకేజీకి ఎంపికైంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసి ఇంటర్వ్యూకు హాజరైన ఈమె ప్రతిభ ఆధారంగా సినోప్సిస్ కంపెనీలో ఉద్యోగం సాధించింది. శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ క్యాంపస్‌లో 2018లో ప్రీ యూనివర్సిటీ కోర్సులో చేరి ప్రస్తుతం చివరి చదువుతోంది. ఈ సందర్భంగా విద్యార్థిని ఎస్ఎంపురం ఆర్‌జీయూకేటీ క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ శనివారం అభినందించారు. విద్యార్థులు మంచి ప్యాకేజీలతో కొలువు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతిష్టాత్మక గేట్ పరీక్షలో సైతం ఇక్కడి విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు.


### కాశ్మీరు నుంచి కన్యాకుమారికి పాదయాత్ర



పాదయాత్ర చేస్తూ కంచిలి చేరుకున్న శివకరణ్ సింగ్

కంచిలి: దేశ సరిహద్దులో సైనికులు చేస్తున్న త్యాగాలకు గుర్తుగా, వారికి దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలంతా మద్దతు తెలపాలని కోరుతూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి పాదయాత్ర చేస్తున్నట్లు దేశ్‌భక్తి శివకరణ్ సింగ్ తెలిపారు. పాదయాత్ర చేస్తూ శనివారం సాయంత్రానికి కంచిలి చేరుకోగా స్థానిక వ్యాపారి పూనా శ్రీకాంత్ ఆశ్రయం కల్పించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శివకరణ్ సింగ్ 2022 మార్చి 25న తన రాష్ట్రం నుంచి బయలుదేరి 2022 నవంబర్ 30న కాశ్మీర్ చేరుకున్నారు. అక్కడి నుంచి కన్యాకుమారికి బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దు సైనికులకు అందరి మద్దతు కావాలని, దేవీ అనుగ్రహం కూడా ఉండేలా చూడాలని ప్రార్థిస్తున్నానని చెప్పారు. 2009లోనూ పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు.

### ఇచ్ఛాపురం డిగ్రీ కళాశాలలో నాక్‌బృందం పరిశీలన



నాక్‌బృందంతో కళాశాల సిబ్బంది

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో నాక్ బృందం చైర్మన్ డాక్టర్ పరమేంద్ర బాజ్‌పాయ్, సభ్యులు జయ్‌దీప్ చౌదరి, హరిదాస్ విదాతే పర్యటించారు. కళాశాలలో విద్యా ప్రమాణాలు, విద్యార్థులు సాధించిన విజయాలు, సంఘసేవ, స్వచ్ఛంద సేవ, పరిశీలన అంశాలు, కళాశాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మరుగుదొడ్లు, ఇతర కళాశాలతో ఎంఒయూ, కెరీర్ గైడెన్స్ తదితర అంశాలపై ఆరా తీశారు. గతంలో నాక్-సి గ్రేడ్ లభించగా, ప్రస్తుతం మరింత మెరుగైన గ్రేడ్ దక్కే అవకాశముందని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అధ్యాపక సిబ్బంది శివకుమార్, సంతోష్‌కుమార్, నాగేశ్వరరావు, దుర్యోధన, రాజేంద్ర త్రిపాఠి, బృందావన్ వరప్రసాద్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థుల మరో జాబితా విడుదల



భువనేశ్వర్: భారత జాతీయ కాంగ్రెస్ అభ్యర్థుల మరో జాబితాను శనివారం విడుదల చేసింది. రాష్ట్రంలో 3 లోక్‌సభ, 16 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల జాబితాను ఆ పార్టీ విడుదల చేసింది. అసికా పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి దేవకాంత్ శర్మ, సంబల్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి దులాల్ చంద్ర ప్రధాన్, కెంజొహర్ స్థానానికి వినోద్ నాయక్ పేర్లు ప్రకటించారు. కెంజొహర్ నియోజకవర్గానికి లోగడ జారీ చేసిన జాబితాలో మోహన్ హేంబ్రామ్ అభ్యర్థిగా ప్రకటించి తాజా జాబితాలో మార్చినట్లు అఖిల భారత జాతీయ కాంగ్రెస్ (ఏఐసీసీ) ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. కొంటామల్ శాసనసభ నియోజకవర్గంలో మనోజ్ కుమార్ ఆచార్య స్థానంలో శరత్ కుమార్ ప్రధాన్, జయదేవ్ నియోజకవర్గంలో జయంత్ కుమార్ భొయ్ స్థానంలో కృష్ణ సగారియా, కవి సూర్య నగర్ స్థానంలో బిపిన్ బిహారి స్వంయి స్థానంలో సంజయ కుమార్ మండల్ ప్రకటించారు. తాజా జాబితాతో కాంగ్రెసు రాష్ట్రంలో 147 శాసన సభ స్థానాల్లో 138 స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసింది.

| అసెంబ్లీ అభ్యర్థుల జాబితా | |
|---|---|
| నియోజకవర్గం | అభ్యర్థి |
| ఝార్సుగుడ | అమిత విశ్వల్ |
| బొడొసాహి | క్షీరోద్ చంద్రపాత్రో |
| సుకిందా | బిభూ భూషణ్ రౌత్ |
| కొంటామల్ | శరత్ కుమార్ ప్రధాన్ |
| కేంద్రాపడా (ఎస్సీ) | సిప్రా మల్లిక్ |
| రాజ్‌నగర్ | అశోక్ ప్రతిహారి |
| మహాకల్పడ | లోక్‌నాథ్ మహారథి |
| నిమాపడా | సిద్ధార్థ్ రౌత్రాయ్ |
| పిప్పిలి | జ్ఞానరంజన్ పట్నాయక్ |
| జయదేవ్ (ఎస్సీ) | కృష్ణ సగారియా |
| ఖుర్దా | సొనాలి సాహు |
| చిలికా | ప్రదీప్ కుమార్ స్వంయి |
| ఖండపడా | మనోజ్ కుమార్ ప్రధాన్ |
| దసపల్లా (ఎస్సీ) | నకుల నాయక్ |
| కవి సూర్య నగర్ | సంజయ్ కుమార్ మండల్ |
| గోపాలపూర్ | శ్యామసుందర్‌గడ్ సాహు |

## ‘లక్ష్య సాధనకు దృఢ సంకల్పం అవసరం’



విద్యార్థులతో మాట్లాడుతున్న దీపక్ చౌదరి

భువనేశ్వర్: లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరికీ దృఢ సంకల్పం అవసరమని ప్రముఖ జీవన శైలి, నేతృత్వ శిక్షకుడు దీపక్ చౌదరి అన్నారు. స్థానిక భారత సాంకేతిక సంస్థ (ఐఐటీ) అన్‌లీష్ ద ఫైర్ వితిన్ శీర్షికతో శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన వక్తగా పాల్గొన్నారు. సహజ జీవన శైలి నుంచి కల్పిత జీవనం సాకారానికి పలు సోపానాలను విద్యార్థులకు వివరించారు. జీవితంలో విజయం సాధించడానికి లక్ష్యాన్ని ఏర్పరచుకోవడం కీలకమైన అంశంగా పేర్కొన్నారు. లక్ష్య నిర్ధారణ, లక్ష్య సాధన క్రమశిక్షణ, పరిమిత-అపరిమిత లక్ష్యం ఛేదనకు బుల్లెట్ ప్రూఫ్ వంటి దృఢ విశ్వాసం ప్రధానమైనదిగా వివరించారు. లక్ష్య సాధనకు తగినంత రీతిలో క్రమశిక్షణతో కూడిన జీవన శైలి అలవరచుకోవాలని ప్రోత్సహించారు. విజయం సాధించడానికి ఉద్దేశం, నమ్మకం కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రొఫెసర్ డాక్టర్ కె.విజయకృష్ణ, ఇన్‌స్టిట్యూట్ రిజిస్ట్రార్ బామదేవ్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసిన ఆస్పత్రి సిబ్బంది



రక్తదానం చేస్తున్న డాక్టర్లు

జయపురం: పట్టణంలోని బ్లడ్ బ్యాంక్‌లో రక్త నిల్వలు కొరత కారణంగా రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇది గమనించిన స్థానిక జిల్లా కేంద్రాస్పత్రి సిబ్బంది రక్తదానం చేసేందుకు ముందుకొచ్చారు. ఈ మేరకు ఆస్పత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. మొత్తం 35 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రక్తదానంకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని పేర్కొన్నారు.

## ఓటరు సచేతన రథం ప్రారంభం



సచేతన రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ స్మృతి రంజాన్ ప్రధాన్

పర్లాకిమిడి: పదండి అందరం కలిసి ఓటువేద్దాం, రాజ్యాంగ విలువలను కాపాడుదాం అనే నినాదంతో కలెక్టర్ కార్యాలయం నుంచి ఓటరు సచేతన రథాన్ని జిల్లా పాలనాధికారి స్మృతి రంజాన్ ప్రధాన్ శనివారం ప్రారంభించారు. ఈ రథం జిల్లాలోని పర్లాకిమిడి మున్సిపాలిటీ, కాశీనగర్ ఎన్ఏసీలతో పాటు మోహనా, ఆర్.ఉదయగిరి, గుసాని, గుమ్మా సమితిల్లో పర్యటిస్తుందన్నారు.

కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ కమలకాంత పండా, జిల్లా శిశు సురక్ష అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి, డీపీఆర్‌వో ప్రదీప్త గురుమయి పాల్గొన్నారు.

## ప్రచార ఖర్చులపై నిరంతర నిఘా



మాట్లాడుతున్న వ్యయ పరిశీలకులు నినా నిగమ్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల ఖర్చులపై నిరంతర నిఘా ఉంచాలని ఎన్నికల వ్యయ ప్రత్యేక పరిశీలకులు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి నీనా నిగమ్ ఆయా నోడల్ ఏజెన్సీ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వివిధ రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ, అలాగే సాధారణ ఎన్నికల సన్నద్ధతపై నోడల్ అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. జిల్లా ఎన్నికల పరిశీలకులు కోమల్ జిత్ మీనా, శరవణ కుమార్, నవీన్ కుమార్ సోనీలతో కలిసి ఆమె మాట్లాడారు. కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తొలుత ఎన్నికల పరిశీలకునికి జిల్లాలోని వ్యయ పర్యవేక్షణ బృందాల పనితీరు గురించి వివరించారు. ఎస్పీ జీఆర్ రాధిక మాట్లాడుతూ ఎన్నికల కోసం చేసిన భద్రత ఏర్పాట్లను వివరించారు.

బృందాలు పనిచేస్తున్న తీరు గురించి నీనా నిగమ్ ఆరా తీశారు. ఇక్కడ ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. స్వతంత్ర్య అభ్యర్థులు సహా అందరి ప్రచార ఖర్చుల బుకింగ్ పై కూడా అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. బ్యాంకుల నుంచి జరిగే అనుమానాస్పద నగదు లావాదేవీలు, ముఖ్యంగా ఐదు లక్షలకు మించిన నగదు డిపాజిట్లపై, మద్యం షాపులకు వెళ్లే సరుకు రవాణాపై నిరంతర నిఘా ఉంచాలన్నారు.

### స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలకు పటిష్ట భద్రత

ఎచ్చెర్ల క్యాంపస్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంలు భద్రపర్చే స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాలకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. జిల్లాలో ఎనిమిది నియోజక వర్గాల స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాలు చిలకపాలెంలో ని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ కల్పించాల్సిన ఏర్పాట్లపై ఆమె శనివారం అధికారులతో చర్చించారు. ఎన్నికల సంఘం అధికారుల సూచనల మేరకు భద్రత ఉంటుందని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లకు 24 గంటలు భద్రత ఉంటుందని అన్నారు. సీసీ కెమెరాలు, 24 గంటల విద్యుత్ సౌకర్యం వంటివి ఏర్పాటు చేస్తామన్నారు.

### కంట్రోల్ రూమ్ పరిశీలన

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల ప్రత్యేక వ్య య పరిశీలకులు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి నీనా నిగమ్, ఎన్నికల పరిశీలకులు కోమల్ జిత్ మీనా, శరవణకుమార్, నవీన్ కుమార్ సోనీలతో కలసి నూతన కలెక్టరేట్ సముదాయంలో ఏర్పాటు చేసిన జిల్లా ఎన్నికల నియంత్రణ (కంట్రోల్ రూమ్) కేంద్రాన్ని శనివారం సందర్శించారు. మీడియా మానిటరింగ్, మోడ ల్ కోడ్ కమిటీ, సోషల్ మీడియా, జిల్లా ఎక్స్‌పెండిచర్ కమిటీ, కంప్లైంట్స్, రిపోర్టింగ్, మీడి యా సెంటర్ విభాగాలను పరిశీలించారు. కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఎస్పీ జీఆర్ రాధిక వారికి ఆయా విభాగాలను పరిచయం చేసి, వాటి పనితీరును వివరించారు.

### ఐదు మృతదేహాలు వెలికితీత

- పడవ బోల్తా ప్రమాదంలో 7కి చేరిన మృతులు

భువనేశ్వర్: ఝార్సుగుడ జిల్లా మహానదిలో జరిగిన ఘోర పడవ ప్రమాదంలో మరో ఐదు మృతదేహాలను వెలికితీయడంతో మృతుల సంఖ్య శనివారం ఏడుకు చేరింది. శుక్రవారం జరిగిన దుర్ఘటనలో గల్లంతైన మరో వ్యక్తి ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది. ఒడిశా విపత్తు స్పందన దళం ఒడ్రాఫ్, అగ్నిమాపక సిబ్బంది హిరాకుడ్ జలాశయం ప్రాంతంలో చేపట్టిన గాలింపు చర్యలో ఐదు మృతదేహాలను వెలికి తీశారు. శుక్రవారం ప్రమాదం తర్వాత ప్రారంభించిన గాలింపు చర్యలో రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ విషాదం మృతుల్లో 3 మంది మహిళలు, 3 మంది బాలురు ఉన్నట్లు సమాచారం. మరణించిన వారంతా పొరుగు రాష్ట్రం ఛత్తీస్‌గఢ్‌లోని ఖర్సేని ప్రాంతానికి చెందినవారని తెలుస్తోంది. అంబొబొణొ మండలం పరిధి పాథొరొసేని ప్రాంతానికి 50 మంది ప్రయాణికులు పడవలో వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. తక్షణమే మత్స్యకారులు 40 మంది ప్రయాణికులను రక్షించగా మరికొందరు గల్లంతయ్యారు.

### రాయగడలో భారీవర్షం

రాయగడ: పట్టణంలో శనివారం మధ్యాహ్నం భారీవర్షం కురిసింది. దీంతో ఉక్కపోతతో ఉన్న జనాలకు కాస్తంత ఊరట కలిగించింది. వాతావరణం చల్లగా మారడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సుమారు గంటపాటు ఏకధాటిగా కురిసిన వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలువలు నిండిపోయి చెత్తాచెదారాలు రోడ్లపైకి వచ్చాయి.


### అంబులెన్స్ ఢీకొని దంపతులు మృతి



ప్రమాదానికి కారణమైన అంబులెన్సు

భువనేశ్వర్: అంబులెన్స్ ఢీకొని దంపతులు మృతి చెందిన విషాదకర ఘటన బౌద్ జిల్లాలో శనివారం చోటుచేసుకుంది. వేగంగా దూసుకొచ్చిన అంబులెన్స్ దంపతుల ప్రాణాలను బలిగొంది. మృతులు మిట్టు బెహెరా, అతని భార్య మనోరమ బెహెరాగా గుర్తించారు. వీరిరువురు తమ ఇద్దరు పిల్లలతో కలిసి అఠామల్లిక్ నుంచి బౌద్‌కు వెళుతున్నారు. మార్గమధ్యలో బ్రిడ్జి నుంచి మహానది నీటి ప్రవాహాన్ని తమ కూతుళ్లకు చూపించేందుకు బైక్ నిలిపారు. వారి పిల్లలు మహానది నీటి వీక్షణను ఆస్వాదిస్తున్నప్పుడు భార్యాభర్తలు బైక్‌పై నిరీక్షిస్తూ అమ్మాయిల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో మృత్యువు కబలించింది. సంబల్‌పూర్ వైపు నుంచి దూసుకొచ్చిన అంబులెన్స్ అకస్మాత్తుగా వారిని ఢీకొనడంతో మిట్టు అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య బౌద్ జిల్లా ప్రధాన కార్యాలయ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచింది. మరోవైపు ప్రమాదం జరిగిన వెంటనే అంబులెన్స్ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసు బృందం సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించింది. పోలీసులు ప్రమాదానికి కారణమైన అంబులెన్సు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

### వడదెబ్బకు మూగజీవాలు విలవిల



కాశీబుగ్గ డెంకివీధిలో వడదెబ్బకు గురైన హర్యానా జాతి ఆవు

కాశీబుగ్గ: మండుటెండలు జనంతో పాటు మూగజీవులు సైతం ఇబ్బందులు పడుతున్నాయి. ఎండలకు భయపడి పెంపకందారులు బయట మేతకు తీసుకెళ్లేందుకు కూడా వెనుకాడుతున్నారు. పశువుల శాలలో ఉంచుతున్నా అధిక ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బకు గురవుతున్నాయి. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో 10వ వార్డు డెంకివీధిలో బమ్మిడి లవ కుమార్ రూ.70 వేలుతో కొనుగోలు చేసిన హర్యానా బ్రీడ్ ఆవు శనివారం వడదెబ్బకు గురై ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. పశువైద్య సిబ్బంది వచ్చి పరిశీలించినా కోలుకునే స్థితి లేకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

# కొలువుదీరిన ఘటాలు



పుష్పాలంకరణలో మజ్జిగౌరి అమ్మవారు



కొలువుదీరిన అమ్మవారి ఘటాలు

రాయగడ: మజ్జిగౌరి అమ్మవారి చైత్రోత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారిని పూలతో అలంకరించడంతో ఆకర్షణీయంగా దర్శనం ఇస్తున్నారు. అదేవిధంగా అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలు అమ్మవారి సన్నిధిలో కొలువుదీరాయి. ప్రతిరోజూ ఘటాలు పురవీధుల్లో తిరుగుతాయి. దీనినే నగర పరిక్రమణ అంటారు. దీంతో దుష్టశక్తులు ఏవీ గ్రామంలోకి చొరబడకుండా అమ్మవారు ఘటాల రూపంలో నగర పరిక్రమణ చేసి ప్రజలను దుష్ట శక్తుల బారినుంచి కాపాడుతారని ప్రతీతి.

చండీహోమం

ఉత్సవాల్లో భాగంగా శనివారం నుంచి చండీహోమం పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం సూర్యపూజ, మహాస్నానం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవాలు ముగిసేంతవరకు చండిహోమం పూజలు కొనసాగుతాయి. ఆఖరి రోజున పూర్ణాహుతితో పూజలు ముగుస్తాయి. ఉత్సవాల్లో కోరిన కోర్కెలు తీరుతాయని, అంతా శుభప్రదంగా ఉంటుందని భక్తులు అమ్మవారి తాయత్తులు ధరిస్తారు. దీంతో తాయత్తుల విక్రయ దుకానాలు అమ్మవారి సన్నిధిలో ఏర్పాటు చేశారు.



అమ్మవారి తాయత్తుల దుకాణం



పూజా కార్యక్రమాల్లో ఆలయ ట్రస్టు సభ్యులు

# బీజేడీ స్టార్ క్యాంపెయినర్ల జాబితా విడుదల

రాయగడ:

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అధికార బీజేడీ పార్టీ ఎన్నికల ప్రచారానికి సంబంధించి సన్నాహాలు చేసింది. ఈ క్రమంలో ఎన్నికల ప్రచారం నిమిత్తం స్టార్ క్యాంపెయినర్ల జాబితాను శంఖ భవన్ నుంచి శనివారం విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం...

1. సీఎం నవీన్ పట్నాయక్
2. కార్తికేయ పాండ్యన్
3. ప్రణవ్ ప్రకాష్ దాస్
4. దేవి ప్రసాద్ మిశ్రా
5. రాణేంద్ర ప్రతాప్ స్వయి
6. చంద్రశేఖర్ సాహు
7. అశోక్ చంద్ర పండ
8. స్నేహాంగిణి ఛురియా
9. నిరంజన్ పూజారి
10. ప్రతాప్ జెన్న
11. ప్రతాప్ కేశరి దేవ్
12. అతున్ సవ్యసాచి నాయక్
13. డాక్టర్ అరుణ్ కుమార్ సాహు
14. సంజయ్ కుమార్ దాస్ వర్మ
15. పద్మనావ్ బెహర
16. ప్రదీప్ కుమార్ ఆమత్
17. నెక్కంటి భాస్కరరావు
18. సుభాష్ సింగ్
19. డాక్టర్ సస్మిత పాత్రా
20. మానస్ రంజన్ మంగరాజ్
21. నిరంజన్ బిషి
22. మమతా మహాంత
23. ముజిబుల్లా ఖాన్(మున్నా)
24. సులాత దేవ్
25. రవీంద్ర కుమార్ జెన్న
26. సరోజిని హేంబ్రమ్
27. సుశాంత సింగ్
28. ప్రణవ్ కుమర్ బలవంతరాయ్
29. ప్రీతిరంజన్ ఘరయ్
30. చిరంజీవీ బిశ్వాల్
31. రమేష్ చంద్ర మాఝి
32. సుధీర్ కుమార్ సామల్
33. డాక్టర్ బ్యోమకేష్ రాయ్
34. దేవి రంజన్ త్రిపాఠి
35. బిజయ్ నాయక్
36. శ్రీమయి శ్వేత స్నిగ్ధ మిశ్రా
37. ఫేక్ నిజాముద్దీన్
38. ఈశ్వర్ పాణిగ్రహి
39. అమేష్ జెన్న
40. ఎలీనా దాస్

## మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

పర్లాకిమిడి: స్థానిక హైస్కూల్ జంక్షన్ పాత డీఈవో కార్యాలయం ఎదుట ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉపాధ్యాయులు మజ్జిగను శనివారం పంపిణీ చేశారు. పర్లాకిమిడిలో గత వారం రోజులుగా 42 డిగ్రీలు నమోదు కావడంతో బాటసారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ మజ్జిక పంపిణీ శిబిరంలో డీఈవో డాక్టర్ మాయాధర్ సాహు ఆదేశాలతో రాష్ట్ర ముఖ్య కమిషనర్ జాతీయ ఉపాధ్యక్షుడు డా.కాళీప్రసాద్ మిశ్రా, జిల్లా కార్యదర్శి సురేంద్ర కుమార్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

## విశ్వసనీయ నాయకుడు మంత్రి ధర్మాన

- వైఎస్సార్‌సీపీకి మద్దతు ప్రకటించిన విశ్రాంత ఉద్యోగులు



ఏకగ్రీవ తీర్మానం చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి మరోసారి ధర్మాన ప్రసాదరావు విజయానికి కృషి చేయాలని విశ్రాంత ఉద్యోగులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. పలు ప్రభుత్వ విభాగాల్లో పనిచేసి, అనేక ఎన్నికల అనుభవాలు గల సీనియర్లు కూడా ప్రత్యేకంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ రెవెన్యూ మంత్రి స్థాయిలో ధర్మాన ఉన్నా ఏ ఒక్క అధికారిని, ఉద్యోగిని ఇబ్బంది పెట్టలేదని గుర్తు చేసుకున్నారు. వ్యక్తిగతంగా, రాజకీయంగా ఆయన జీవితం విలువలకు కట్టుబడి ఉందన్నారు. ఎన్నుకున్న ప్రజల నమ్మకాన్ని ఏనాడూ వమ్ము చేయలేదని, నియోజక వర్గాన్నే కాకుండా, జిల్లా శాశ్వత అభివృద్ధికి చేసిన కృషి గత పాలకులెవ్వరు చేయలేదని పలు ఉదాహరణలతో వివరించారు. నీతివంతమైన వ్యక్తిత్వంతో భావితరాలకు ఆదర్శంగా నిలిచిన గొప్ప నాయకుడు ధర్మాన ప్రసాదరావు అని పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలన్నీ పౌరులకు అందేలా, దేశానికే రోల్ మోడల్ వంటి ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనాలను నిర్మించడం అభినందనీయమన్నారు. అసెంబ్లీలో, ఇతర వేదికలపై ఆయన చేసిన ప్రసంగాలు శ్రీకాకుళానికి కీర్తి ప్రతిష్ఠలు సంపాదించి పెట్టాయని చెప్పారు. ఇటువంటి నాయకత్వం సమాజానికి అవసరమని, మరోసారి ఆయనకు అండగా నిలబడి, భారీ మెజార్టీతో గెలిపించాలని నిర్ణయిస్తూ విశ్రాంత అధికారి సురంగి మోహన్‌రావు ప్రతిపాదించిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

### కొండంత బలం

అధికారిగా, ఉద్యోగిగా, వ్యక్తిగా సమాజానికి ఎన్నో సేవలు అందించి, ఎన్నో అనుభవాలతో అపారమైన జ్ఞానాన్ని సంపాదించిన పెద్దలు, శ్రేయోభిలాషులు ఒక దగ్గరకు చేరి ఏకగ్రీవంగా తనకు మద్దతు ప్రకటించడం గొప్ప బలాన్ని ఇచ్చింది. ఏకగ్రీవంగా మద్దతు ప్రకటించడం జీవితంలో మర్చిపోలేని ఘట్టం. మీ ఆశలకు, ఆకాంక్షలకు భంగం లేకుండా మరింత గర్వపడేలా పనిచేస్తా.

– మంత్రి ధర్మాన ప్రసాదరావు

### సివిల్స్ విజేత వెంకటేశ్‌కు ఘనస్వాగతం



వెంకటేశ్ తల్లి దండ్రులు చంద్రరావు, రోహిణిలను అభినందిస్తున్న గ్రామపెద్దలు

జలుమూరు: సివిల్స్ విజేత బాన్న వెంకటేశ్‌కు స్వగ్రామంలో ఘన స్వాగతం లభించింది. ఆయన శనివారం తిరుపతి నుంచి స్వగ్రామం అల్లాడపేటకు వచ్చారు. తల్లిదండ్రులు రోహి ణి, చంద్రరావులతోపాటు చిన్న కుమారుడు బాన్న వంశీ వెంకటేశ్‌ను మనసారా అభినందించారు. గ్రామ పెద్దలు కూడా వెంకటేశ్‌ను అభినందించారు. అల్లాడపేటకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కా ర్యక్రమంలో సర్పంచ్ కల్యాణం చిన్నమ్మడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## క్లుప్తంగా

### మద్యం బాటిళ్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న ఎస్‌ఈబీ సీఐ

**రాజాం సిటీ:** మండల పరిధి కంచరాం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను ఎస్‌ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి గ్రామానికి చెందిన రౌతు పోలినాయుడు వద్ద 48 మద్యం బాటిళ్లను గుర్తించామని సీఐ బి.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు వాటిని స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేశామని తెలిపారు. అలాగే అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. ఎస్ఐలు చంద్రశేఖర్, శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### దేవీ దండుమారమ్మ ఆలయం వద్ద అన్న సమారాధన

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎస్పీ ఎం.దీపిక



అమ్మవారికి భోగం పెడుతున్న ఎస్పీ ఎం.దీపిక

**విజయనగరం క్రైమ్:** జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దేవీ దండుమారమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్నసమారాధన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ ఎం.దీపిక హాజరై, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాధువులకు, భక్తులకు భోజనాలను వడ్డించారు అనంతరం ఎం.దీపిక ఆలయ కమిటీ సభ్యులు, ఇతర పోలీసు అధికారులు అమ్మవారి ప్రసాదాలను స్వీకరించారు. ఇటీవల అమ్మవారి పండగ మహోత్సవాలను ఏప్రిల్ 9 నుంచి ఏప్రిల్ 16 వరకూ జిల్లా పోలీస్ శాఖ ఘనంగా నిర్వహించారు. మహోత్సవ ముగింపు వేడుకల్లో జిల్లా ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఆర్ఐలు ఎన్.గోపాలనాయుడు, రమేష్, ఆలయ కమిటీ సభ్యులు తాతరాజు, రవీశ్వరుడు, వాసు, శివ, లక్ష్మణ్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

**విజయనగరం క్రైమ్:** గుర్తు తెలియని వ్యక్తి కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు వన్ టౌన్ పోలీసులు శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. ఎల్ఐసీ కార్యాలయం నుంచి బాలాజీ జంక్షన్ మధ్య ఉన్న రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండగా స్థానికుల సహాయంతో ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. ఈ మేరకు శనివారం అతను మృతి చెందినట్లు ఆస్పత్రి వైద్యులు ధ్రువీకరించారన్నారు. సుమారు 60 నుంచి 65 ఏళ్ల వయసు కలిగి ఉంటుందన్నారు. ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

### విద్యుత్ షాక్‌తో రైతు మృతి





రేగిడి: పంపుషెడ్ వద్ద మృతి చెందిన రైతు, (ఇన్‌సెట్లో) ఆలుబిల్లి అప్పలనాయుడు (ఫైల్)

**రేగిడి/పాలకొండ రూరల్:** రేగిడి మండలంలోని బొడ్డవలస గ్రామంలో చెరకు పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ మండలం అంపిలి గ్రామానికి చెందిన రైతు ఆలుబిల్లి అప్పలనాయుడు(60) శనివారం ఉదయం నాగావళి నదికి ఆవలివైపు ఉన్న రేగిడి మండలంలోని బొడ్డవలసలో మోటార్ బోరు ద్వారా పంటకు నీటిని అందించే క్రమంలో పంప్‌షెడ్ వద్ద విద్యుత్ షాక్‌కు గురయ్యాడు.

ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో మృత్యువాతపడ్డాడు. కొద్ది సేపటి తర్వాత ఈ ప్రమాదాన్ని గుర్తించిన సహచర రైతులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కుటుంబ పెద్ద పొలంలో మరణించడాన్ని చూసిన కుటుంబీకులు గుండెలు పగిలేలా రోదించారు. అంపిలి గ్రామస్తులు, వైఎస్ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్, సర్పంచు లోలుగు విశ్వేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతుని భార్య నాగమ్మ, ముగ్గురు పిల్లలను ఓదార్చారు. ఈ ఘటనపై రేగిడి పోలీసులు కేసు నమోదు చేశారు.

# సర్కారు వారి సాయంతో..!

- శిక్షణతో పొందుతూ..ఉపాధి సాధిస్తూ
- స్థిరపడుతున్న యువత
- గుమ్మలక్ష్మీపురం వైటీసీలో కొనసాగుతున్న ఉపాధి శిక్షణ
- ఏపీ స్కిల్‌హబ్ పేరుతో కూడా ట్రైనింగ్




గుమ్మలక్ష్మీపురం వైటీసీలో డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువత

**గుమ్మలక్ష్మీపురం:** నిరుద్యోగ యువతకు ఆసక్తి ఉన్న రంగాల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వారికి సాయం చేస్తూ బాసటగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని వైటీసీ (యూత్ ట్రైనింగ్ సెంటర్)లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, మెడికల్ రికార్డ్ అసిస్టెంట్, రిటైల్ స్టోర్ మేనేజర్, డ్రైవింగ్ వంటి కోర్సుల్లో 240 మందికి ఇప్పటి వరకు శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం డేటా ఎంట్రీ ఆపరేటర్, నర్సింగ్ కోర్సుల్లో 30 మంది చొప్పున 60 మందికి శిక్షణ ఇస్తున్నారు.

**పాలిటెక్నిక్ కళాశాలలో..**

కుటుంబ ఆర్థిక, ఇతర పరిస్థితుల కారణంగా ఉన్నత చదువులు చదవలేక పదో తరగతి, ఇంటర్మీడియట్ వంటి కోర్సులకే పరిమితమైన వారికి ఉద్యోగం చేయాలనే తపన ఉన్నా సరైన నైపుణ్యం కొరవడి వెనుకబడుతున్నారు. అటువంటి యువతకు సుశిక్షితులతో మంచి శిక్షణ ఇప్పించి ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ హబ్‌లు నిర్వహిస్తోంది. గుమ్మలక్ష్మీపురంలోని పాలిటెక్నిక్ కళాశాలలో 2022 అక్టోబర్‌లో ఏర్పాటైన స్కిల్ హబ్ శిక్షణ సంస్థ ఇప్పటివరకు నిరుద్యోగ యువత 1140 మందికి ఏసీ/రిఫ్రిజిరేటర్ టెక్నీషియన్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, టైలరింగ్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజర్, ఫోర్‌వీలర్ టెక్నీషియన్, డ్రైవింగ్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇచ్చింది. ఇక్కడ శిక్షణ పొందిన వారిలో 370 మంది ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం ఇదే స్కిల్ హబ్‌లో కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజర్ కోర్సులో నిరుద్యోగ యువత శిక్షణ పొందుతున్నారు.




**భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలో..**

గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐ వద్ద అసిస్టెంట్ ప్లంబర్ కోర్సులో శిక్షణ ఇచ్చేందుకు 240 మందికి ఎంపిక చేయగా..మొదటి విడతగా ప్రస్తుతం 30 మందికి ఈ కోర్సులో శిక్షణ అందిస్తున్నారు.

- వీటితో పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే 700 మందికి ఎంప్లాయిబులిటీ స్కిల్ సెంటర్ (ఈఎస్‌సీ)పేరుతో పార్వతీపురంలోని ఎస్‌వీడీ డిగ్రీ కళాశాల, సాయిరాం డిగ్రీ కళాశాల, పాలకొండలోని తమ్మినాయుడు డిగ్రీ కళాశాల, సాలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆన్‌లైన్ ఆఫ్‌లైన్‌లో టాలీ, ఎంఎస్ ఆఫీస్, డిజిటల్ మార్కెటింగ్ వంటి కోర్సుల్లోనూ ఉచిత శిక్షణను అందించింది.

**శిక్షణ ఇస్తున్నాం..**



గుమ్మలక్ష్మీపురం వైటీసీలో నర్సింగ్, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో 150 మందికి శిక్షణ ఇచ్చేందుకు అనుమతులు రాగా ప్రస్తుతం రెండు కోర్సుల్లో 60 మంది నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ అందజేస్తున్నాం. ఈ బ్యాచ్ ముగియగానే మళ్లీ మిగతా 90 మందికి శిక్షణ అందజేస్తాం. అంతేకాకుండా ఈ వైటీసీలోనే గిరిశిఖర గ్రామాల గర్భిణుల వసతి గృహాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నాం.

– ఎస్.రాము, మేనేజర్, గుమ్మలక్ష్మీపురం వైటీసీ

## ● పకడ్బందీగా పాలిసెట్



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్‌ఓ అనిత

- డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత

**విజయనగరం అర్బన్:** ఈ నెల 27న జరిగే పాలిసెట్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీ అనిత ఆదేశించారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష – 2024 నిర్వహణపై తన చాంబర్‌లో శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ ఈ నెల 27న నిర్వహించే పరీక్షకు సుమారు 8,864 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. విజయనగరంలో 11, గజపతినగరంలో 6, బొబ్బిలిలో 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. విజయనగరం సెంటర్లలో 4,509, గజపతినగరంలో 2,009 మంది, బొబ్బిలిలో 2,346 విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందని, విద్యార్థులను గంట ముందు లోపలికి అనుమతిస్తామని తెలిపారు. ఎట్టి పరిస్థితిలోనూ 11 గంటల తరువాత ఒక్క నిమిషం దాటినా లోపలికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఎటువంటి లోపాలు లేకుండా పరీక్షకు ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు తాగునీరు, ప్రాథమిక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాలిసెట్‌కు సంబంధించి ఇతర వివరాల కోసం సెల్ నెంబర్ 79897 81520 నెంబర్‌కు సంప్రదించాలని డీఆర్‌ఓ సూచించారు. సమావేశంలో పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్ ఆషారాణి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, విద్య, విద్యుత్, వైద్యారోగ్య, పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులు, పరీక్షా కేంద్రాల కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## ఉత్తరాంధ్ర ప్రాంతీయ చిత్రానికి ఆడిషన్స్



ఆడిషన్స్ నిర్వహిస్తున్న సంస్థ నిర్వాహకులు

**విజయనగరం క్రైమ్:** ప్రముఖ సినీ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఉత్తరాంధ్ర ప్రాంతీయ చిత్రానికి సంబంధించి పట్టణంలోని కణపాక యూత్ హాస్టల్‌లో రెండు రోజుల పాటూ నటీనటుల ఎంపికకు సంబంధించి ఆడిషన్స్ నిర్వహిస్తున్నామని సంస్థ ప్రతినిధి జానకీరామ్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన ఆడిషన్స్‌లో నటులు అద్భుతమైన నటనాప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జానపద కళాకారిణి జీవితంలో యథార్థ సంఘటనలు ఆధారంగా చేసుకుని రూపొందిస్తున్న చిత్రానికి కళాకారులను ఎంపిక చేస్తున్నామన్నారు. ఉత్తరాంధ్ర మాండలికంతో పాటు కిన్నెర, జముకుల కథ, తప్పెట గుళ్లు, వీధి నాటక కళాకారులు కూడా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఇదొక సువర్ణ అవకాశమన్నారు. 21న ఆదివారం కూడా ఆడిషన్స్ ఉంటాయన్నారు. 22, 23 తేదీల్లో విశాఖ సిటీ బీచ్ రోడ్డులో వైవీఎం అపోజిట్‌లో ఉన్న యూత్ హాస్టల్, వైఎస్సీపీ కిర్లంపూడి లేఅవుట్ వద్ద జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వికాస్, గాయకులు జానకీరామ్, నంది అవార్డు గ్రహీత తిరుపతినాయుడు మాస్టారు, గెద్ద వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వెదుళ్లవలసలో హత్య

- అల్లుడిని హతమార్చిన అత్త, మామ, భార్య



మృతుడు కొలుసు అప్పన్న (ఫైల్)

**చీపురుపల్లి రూరల్(గరివిడి):** గరివిడి మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో హత్య జరిగింది. గ్రామంలోని యాత వీధిలో అత్త, మామ, భార్య ముగ్గురూ కలిసి శుక్రవారం రాత్రి 10 గంటల సమయం దాటిన తరువాత కొలుసు అప్పన్న (30)ను హత్య చేయటంతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని యాతవీధిలో మృతుడు కొలుసు అప్పన్న, భార్య కొలుసు దేవి నివాసం ఉంటున్నారు. వీరిద్దరితో పాటు మృతుడు అప్పన్న అత్త, మామలు ముంత సన్యాసిరావు, ముంత ఎల్లమ్మలు కూడా ఒకే ఇంటిలో కలిసి ఉంటున్నారు. మృతునికి అత్తమామలు సొంత అక్క, బావ కాగా మేనకోడలు దేవిని వివాహం చేసుకున్నాడు. అప్పన్న లారీ క్లీనర్‌గా దూర ప్రాంతాల్లో పని చేయడానికి వెళ్లి అప్పుడప్పుడు వస్తుంటాడు. భార్యాభర్తలైన అప్పన్న, దేవి మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో అప్పన్నను ఎలాగైనా హతమార్చాలనే ఉద్దేశంతో శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో భార్యతో పాటు అత్తమామలు కలసి అప్పన్నను హత్య చేశారు. భార్య దేవి చున్నీతో అప్పన్న మెడను బిగబెట్టి ఊపి రాడకుండా చేయగా అత్త, మామలు రాయితో తలపై మోది హత్య చేశారు. మృతునికి ఏడాదిన్నర పాప, నెలల బాబు ఉన్నాడు. సంఘటన స్థలాన్ని సీఐ షణ్ముఖరావు, ఎస్ఐ దామోదరరావు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

**రాజాం సిటీ:** స్థానిక శ్రీకాకుళం రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేశామని ఏఎస్ఐ భాస్కరరావు తెలిపారు. ఈ నెల 18న సైకిల్‌పై రాజాం వైపు వస్తున్న నేచురల్ సెలూన్‌లో పని చేస్తున్న విక్రమ్‌ను ఎదురుగా వస్తున్న వ్యక్తి ద్విచక్ర వాహనంతో ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఈ మేరకు సెలూన్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

### బొత్స చొరవతో.. మిమ్స్‌లో సమ్మె విరమణ



విధుల్లో చేరేందుకు వెళ్తున్న మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు

**నెల్లిమర్ల:** మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు ఎట్టకేలకు సమ్మె విరమించారు. మంత్రి బొత్స సత్యనారాయణ చొరవతో సమస్య కొలిక్కి వచ్చింది. ఆమోదయోగ్యమైన ఒప్పందంతో సీఐటీయూ సమ్మె విరమణకు అంగీకరించింది. 7.5 శాతం మేర ప్రతీ ఏడాది వేతనం పెంపు, డీఏలు అమలుతో పాటు ఉద్యోగుల మీద వేధింపులు లేకుండా వీలుగా ఒప్పందం జరిగింది. అలాగే జైలులో ఉన్న మిమ్స్ ఉద్యోగులు అందరూ బెయిల్ మీద జైలు నుంచి బయటకు వచ్చారు. ఆ మేరకు శుక్రవారం జరిగిన బహిరంగ సభలో సమ్మె విరమణకు నిర్ణయించారు. దీంతో మిమ్స్ ఉద్యోగులంతా శనివారం విధులకు హాజరయ్యారు. పూర్తి స్థాయిలో మిమ్స్‌లో కార్యకలాపాలు పునఃప్రారంభమయ్యాయి.

## ఫీల్డ్ అసిస్టెంట్ అత్యుత్సాహం!

- ఉపాధిహామీ పనుల్లో చంద్రబాబు బర్త్‌డే వేడుకలు



బొద్దాంలో ఉపాధిహామీ పనుల వద్ద చంద్రబాబు నాయుడు బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న దృశ్యం

**రాజాం:** మండలంలోని బొద్దాం పంచాయతీ పరిధిలోని పూను గుండమ్మ చెరువు, అప్పయ్య బండ, జగ్గువానిచెరువు, భగవాన్ సాగర్ చెరువుల్లో శనివారం ఉపాధి పనులు జరిగాయి. మధ్యాహ్నం 4 గంటల సమయంలో కొంతమంది టీడీపీ కార్యకర్తలు పనులు వద్దకు చేరుకుని చంద్రబాబు బర్త్‌డే కేక్ కట్ చేశారు. వేతనదారులకు కూల్ డ్రింక్‌లు పంపిణీ చేశారు. పంచాయతీకి చెందిన టీడీపీ కార్యకర్తలు ఈ తంతు నిర్వహిస్తుండగా, ఉపాధి పనుల ఫీల్డ్ అసిస్టెంట్ బైరి ఆదినారాయణ అక్కడే ఉన్నట్టు తెలిసింది. ఓ వైపు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుండగా టీడీపీ కార్యకర్తలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడాన్ని కొందరు వేతనదారులు వ్యతిరేకించారు. ఈ విషయాన్ని రాజాం ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు వద్ద 'సాక్షి' ప్రస్తావించగా బొద్దాంలో ఉపాధి పనుల్లో పాల్గొనే వేతనదారులకు టీడీపీ కార్యకర్తలు కూల్ డ్రింక్‌లు పంపిణీ చేసినట్టు తెలిసిందన్నారు. ఆ సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్ బైరి ఆదినారాయణ అక్కడ లేడని చెప్పారన్నారు. అయితే, ఉపాధి పనుల మస్టర్ షీట్‌లో అన్ని పనుల వద్ద ఫీల్డ్ అసిస్టెంట్ హాజరైనట్టు సంతకాలు ఉన్నాయి. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పక్కాగా పరిశీలన

- అరకు పార్లమెంట్ నియోజకవర్గం వ్యయ పరిశీలకుడు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యయ పరిశీలకుడు గురుకరణ్ సింగ్

**పార్వతీపురం:** ఎన్నికల నిర్వహణలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, వీడియో వ్యూయింగ్ బృందాలు ఎన్నికల వ్యయాన్ని పక్కాగా పరిశీలించాలని అరకు పార్లమెంట్ నియోజకవర్గం వ్యయ పరిశీలకుడు గురుకరణ్ సింగ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, వీడియో వ్యూయింగ్ బృందాలతో జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో వ్యయ నమోదుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారంలో భాగంగా నిర్వహించే ర్యాలీలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాలపై దృష్టి సారించాలని, అందులో ఇమిడి ఉన్న ప్రతి వ్యయాన్ని పరిశీలించాలని స్పష్టం చేశారు. ఎక్కడా ఎలాంటి అశ్రద్ధ చేయరాదని సూచించారు. వ్యయ నమోదులో పాటిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, అరకు పార్లమెంట్ నియోజకవర్గం సహాయ రిటర్నింగ్ అధికారి ఎస్ఎస్.శోభిక, వ్యయ విభాగం నోడల్ అధికారి, జిల్లా సహకార అధికారి పి.శ్రీరామూర్తి తదితరులు పాల్గొన్నారు.

# మాయలోడు.. మళ్లీ వస్తున్నాడు...

- ఎస్.కోట నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటన రేపు
- అబద్ధాలు చెప్పేందుక మళ్లీ వస్తున్నాడంటున్న జనం
- గతంలో ఇచ్చిన హామీలన్నీ హుష్‌కాకి
- జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో సమకూరిన సదుపాయాలు



దేవదాయశాఖ నిధులతో ఇటీవల నిర్మించిన రామాలయం



జమ్మాదేవిపేటలో నిర్మించిన సచివాలయ భవనం

**లక్కవరపుకోట:** మండలంలోని అరకు–విశాఖ రోడ్డును ఆనుకొని ఉన్న జమ్మాదేవిపేట గ్రామంలో గతంలో రాష్ట్ర పంచాయతీ, ఐటీ శాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ 2017 నవంబర్ 12వ తేదీన, ఆయన తండ్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో నవనిర్మాణ దీక్షలో భాగంగా 2018 జూన్ 4వ తేదీన పర్యటించారు. అధికార హోదాలో తండ్రీకొడుకులు మంత్రులు, ఎమ్మెల్యేలను, కలెక్టర్‌ను వెంట పెట్టుకొని అధికార దర్పణం ఒలగబోస్తూ లక్షల ప్రజాధనాన్ని వెచ్చించి గ్రామంలో పర్యటించారు. అప్పట్లో గ్రామంలో ప్రతీ ఇంటికీ తాగునీటి కుళాయి కనక్షన్లు పెడతామని హామీ ఇచ్చారు. అందుకు అయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. ఆ హామీ నీటి మీద రాతలుగానే మిగిలాయి. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన సభకు సర్పంచ్ మొయ్యి కన్నయ్య అధ్యక్షత వహించాల్సి ఉండగా కనీసం ఆయనను ఆహ్వానించలేదు. కేవలం దళిత సర్పంచ్ అని వివక్ష చూపారు. ఆయనతోనే గ్రామంలో పార్టీ జెండాలను కట్టించుకున్నారు. గ్రామంలో రామాలయం పునర్నిర్మిస్తామని, కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తామంటూ సుమారు రూ.3కోట్ల విలువైన పనుల నిర్వహణకు హామీలిచ్చారు. ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఎస్.కోట నియోజకవర్గానికి ఈ నెల 22న చంద్రబాబు మళ్లీ వస్తుండడంతో... మాయలోడు మళ్లీ వస్తు న్నాడంటూ గ్రామస్తు లు చర్చించుకుంటున్నారు.

**జగనన్న హయాంలో అభివృద్ధి**

2019లో వైఎస్సార్ సీపీ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జమ్మాదేవిపేట అభివృద్ధిపై సీఎం వై.ఎస్. జగన్‌మో హన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామంలో రూ.32 లక్షలతో గ్రామ సచివాలయ భవ నం నిర్మించారు. రామాలయం నిర్మాణానికి దేవదాయధర్మా దాయ శాఖ నుంచి రూ.48 లక్ష లు కేటాయించారు. సుమారు 8 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజ్‌లను నిర్మించారు. జల్‌జీవన్ మిషన్ కింద రూ.63లక్షల ఖర్చుతో ఇంటింట కుళాయిలు ఏర్పాటు చేశారు.



నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు

## హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ

- డీఎంహెచ్ జగన్నాథ రావు
- పీహెచ్‌సీల సిబ్బందితో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

**పాలకొండ:** హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి బగాది జగన్నాథరావు సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన పాలకొండ పట్టణంలోని కల్యాణ మంటపంలో వీరఘట్టం, పాలకొండ మండలాలకు చెందిన పీహెచ్‌సీల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణిగా నమోదు జరిగిన నాటి నుంచి ప్రసవం వరకు పూర్తిస్థాయి ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని సిబ్బందికి సూచించారు. మొదటి త్రైమాసకంలో గర్భిణుల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలని దీని ద్వారా వైద్య పరీక్షలు జరిగి హైరిస్క్ గర్భిణులను గుర్తించడంతో వైద్యం అందించే అవకాశం ఉంటుందని చెప్పారు. వారి ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాలను స్పష్టంగా నమోదు చేయాలని అప్పుడే ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహాయం అందుతుందన్నారు. వైద్యసిబ్బంది తీసుకోవాల్సిన చర్యలను సమావేశంలో వివరించారు. ఆయనతో పాటు డీఐఓ నారాయణరావు, డీఎంఓ టి. జగన్‌మోహన్ రావు, ప్రోగ్రామ్ అధికారి రఘుకుమార్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.



పాల్గొన్న వైద్య సిబ్బంది